

నాడు లీజుదారులు.. నేడు భూ హక్కుదారులు

సెంచరీ పానెల్స్ పరిశ్రమకు భూములు ఇచ్చిన వారు మొన్నటి వరకు లీజుదారులు. నేడు భూ హక్కుదారులుగా మారారు. -8లో



నేటి నుంచి జిల్లా రచయితల మహాసభలు

కడపలో జిల్లా రచయితల మహాసభలు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.230
రెండోరకం	రూ.90	రూ.168

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 201 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజని, అధికారులు

కడప అర్బన్: రిమ్స్‌లో నేడు(శనివారం) ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పలు భవనాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖమంత్రి విడుదల రజని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు ఆయా విభాగాలను శుక్రవారం పరిశీలించారు. వారి వెంట కడప నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, సూపరింటెండెంట్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తదితరులున్నారు.

సెంచరీ ప్యానెల్స్‌లో..



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం: సీఎం పర్యటన నేపథ్యంలో సెంచరీ పానెల్స్ పరిశ్రమ వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరిశీలించారు. కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. అలాగే హెలిప్యాడ్ స్థలాన్ని కూడా పరిశీలించారు. కాగా, మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

భారీ బందోబస్తు

కడప అర్బన్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నేటి నుంచి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కడప విమానాశ్రయం, రిమ్స్, వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం, కలెక్టరేట్‌తో పాటు నగరంలోని వివిధ సర్కిళ్లలో విధులు నిర్వర్తించనున్నారు. అలాగే బద్వేలులో.. ఇడుపులపాయ, సింహాద్రిపురం, పులివెందుల పట్టణంలో కూడా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న చంద్రానాయక్

నందలూరు(రాజంపేట): రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి బి చంద్రానాయక్ అన్నారు. మండలంలోని పాటూరు ఆర్‌బీకేను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తుపానువల్ల పంటనష్టం జరిగిన రైతులతో మాట్లాడారు. పంట నష్టం పరిహార జాబితా తనిఖీ చేసి ఈనెల 18వ తేదీ నుండి 22 వరకు జాబితాను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులకు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తెలిపారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున, ఏంఈఓ సాయిప్రియ, రైతులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

వైవీయూ : వైఎస్ఆర్ జిల్లా కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాను కళాశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల జేకేసీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో వివిధ బహుళజాతి సంస్థలకు చెందిన 13 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా ఒక వరం లాంటిదన్నారు. ఇలాంటి డ్రైవ్‌లను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాలని సూచించారు. కడప ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ నిరుద్యోగులు డిగ్రీలతోపాటు అదనపు అర్హతలు సాధించాలని సూచించారు. అనంతరం ఎంపికలకు 361 మంది విద్యార్థులు హాజరు కాగా 211 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి ఆర్‌జేడీ చేతుల మీదుగా ఆఫర్ లెటర్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, పెండ్లిమర్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జేకేసీ కోఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు గురివిరెడ్డి, విజయలక్ష్మి, గురుమోహన్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప.. ఉన్నత వైద్యానికి గడప

- అందుబాటులో సూపర్ స్పెషలిటీ వైద్యం
- కేన్సర్ చికిత్సకు పరుగులు అక్కర్లేదు
- మానసిక రోగులకు అధునాతన సేవలు
- నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



కడప రిమ్స్ ఆవరణలో మానసిక వైద్యశాల భవనం

సాక్షి ప్రతినిధి కడప: కడప ఇక ఉన్నతవైద్యానికి, ఉత్తమ చికిత్సకు గడపగా మారనుంది. ఇప్పటికే ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్న రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మానసిక వైద్యం, కేన్సర్ హాస్పిటల్ అందుబాటులోకి వచ్చేశాయి. రూ.282 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్యసేవలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు.

- రాయలసీమ సిగలో కడప వైద్య సేవలు కలికితురాయిగా నిలవనున్నాయి. కేన్సర్ ప్రభుత్వ ఆస్పత్రి, రాష్ట్రంలోని విశాఖపట్టణంలో తప్ప మరెక్కడా లేని మానసిక వైద్యశాల, ప్రైవేటు రంగంలో డాక్టర్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఏర్పాటు కావడం వైద్య రంగంలో కడపకు మరింత ప్రతిష్టను తీసుకు రానున్నాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో 750 పడకల ఆస్పత్రి, డెంటల్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు. రిమ్స్‌లో ప్రతిరోజూ 16–18 వందల మంది ఔట్ పేషెంట్స్ చికిత్స పొందుతుండగా, ఇన్ పేషెంట్స్ 250–300 మంది ఉన్నారు. తాజాగా రూ.125 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, సర్జికల్ సూపర్ స్పెషాలిటీ సర్జరీ, న్యూరో సర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రోలజీ, యురాలజీ, పీడియాట్రిక్ సర్జరీ సేవలు కూడా దక్కనున్నాయి.

100 పడకల మానసిక వైద్యశాల...

రూ. 40 కోట్లతో వంద పడకల మానసిక వైద్యశాల ఏర్పాటు చేశారు. ఇక్కడ ఓపీ, ఐపీ, జైలు వార్డు, మానసిక రోగులకు సదరన్ క్యాంపు విభాగం, డిఅడిక్షన్ వార్డు ఉన్నాయి. చైల్డ్ గైడెన్స్ క్లినిక్, ఓల్డేజ్ మానసిక వార్డు, సైకో థెరఫి, ఫార్మో కో–థెరఫీ విభాగాలు ఏర్పాటు కానున్నాయి. వీటితోపాటు ఆక్యూపెన్సీ థెరఫీ, యోగా థెరఫీ, రిహాబిలిటేషన్ సైకియాట్రిక్ విభాగం, ట్రాన్స్ మ్యాగ్నటిక్ స్టిములేషన్ (టీఎంఎస్) ఏర్పాటు చేశారు. ఇందుకోసం వైద్యులు, సిబ్బంది, సైక్రియాట్రిస్టు, సోషల్ వర్కర్ల నియామకాలు చేపట్టనున్నారు. మరోవైపు వంద పడకలతో కేన్సర్ కేర్ ఆస్పత్రిని నిర్మించారు. ఇందులో కేన్సర్ పరీక్షలు, రేడియేషన్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ వైద్య సేవలు అందనున్నాయి. గతంలో కేన్సర్ బారిన పడిన రోగులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు వెళ్లే వారు. ఇటీవల కాలంలో తిరుపతి, నెల్లూరు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్ కడపలో రావడం ఉపయుక్తం కానుంది.

- కడపలో రిమ్స్ మెడికల్ కళాశాల, దంత వైద్య కళాశాల ఇప్పటికే ఉన్నాయి. మరోవైపు పుష్పగిరి ఐ హాస్పిటల్ ఉండగా, ప్రతిష్టాత్మకమైన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. రాబోయే విద్యా సంవత్సరానికి పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాల అందుబాటులోకి రానుంది. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు విస్తరించే కొద్ది జిల్లాకు పేరు ప్రతిష్టలు మరింతగా విస్తరించనున్నాయి.

సుందర నగరంగా కడప



వై-జంక్షన్‌లో ఏర్పాటు చేసిన స్తూపం

ఓ వైపు మెడికల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్న కడప రమణీయంగా మారనుంది. జిల్లా కేంద్రమైన కడపలో దాదాపు 12 జంక్షన్లను ఆధునీకరించారు. రూ.120 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేశారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్టాండు వై జంక్షన్ రోడ్డును విస్తరించారు. కొత్త వ్యక్తులు కడపలో పర్యటిస్తే ఆశ్చర్యపోయేలా ప్రభుత్వం పనులు చేపట్టింది. పాత జంక్షన్ల స్థానంలో కొన్ని, మరికొన్ని కొత్త జంక్షన్లు ఏర్పాటు చేశారు. ఆదర్శవంతమైన నమూనాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా కడప నగరం కొత్త శోభను సంతరించుకోనుంది. అంతేకాకుండా ట్రాఫిక్ సమస్యకు ఫుల్ స్టాప్ పడనుండటం గమనార్హం.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ కారణంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరుగుతోంది. కడపను సుందరంగా తీర్చిదిద్దాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పటిష్టమైన ప్రణాళికలు అమలు చేస్తున్నాం. వైఎస్సార్ ఈఎంసీ, జెఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమతో రాయలసీమ వ్యాప్తంగా యువతకు జిల్లాలో ఉద్యోగాలు దక్కనున్నాయి. జిల్లాను అంచెలంచెలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం కంకణబద్ధులై ఉన్నారు. – వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, కడప

వైద్యసేవలు అమోఘం




కడపలో వైద్య సేవలు అమోఘం కానున్నాయి. ప్రస్తుతం రెఫర్ హాస్పిటల్ ఉన్న రిమ్స్‌లో గణనీయమైన మార్పు లభించనుంది. తిరుపతి స్విమ్స్, కర్నూల్ జనరల్ హాస్పిటల్‌కు ఇకపై వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎమర్జెన్సీ మెడిసిన్ జిల్లా కేంద్రంలో అందుబాటులోకి వచ్చింది. రాబోయే రోజుల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాతోపాటు పొరుగు జిల్లాల వారు కూడా కడపలో వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. సూపర్ స్పెషాలిటీ, ప్రభుత్వ కేన్సర్ ఆస్పత్రి జిల్లాకు వరం కానున్నాయి. –ఎస్‌బీ అంజద్‌బాషా, డిప్యూటీ సీఎం

క్రీడా కాంతులు

కడప స్పోర్ట్స్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవతో కడపలో క్రికెట్ స్టేడియం ఏర్పాటైంది. ఇందుకు అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి ఎకరా రూ. వెయ్యి చొప్పున 11.6 ఎకరాలను క్రికెట్ మైదానానికి కేటాయించారు. రూ.50 లక్షల సొంతనిధులను మైదానం నిర్మాణం కోసం ఏసీఏకు చెల్లించారు. దీంతో మైదానానికి వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంగా ఏసీఏ పెద్దలు నామకరణం చేశారు. 2011లో అందుబాటులోకి వచ్చిన క్రికెట్ మైదానంలో తర్వాత కాలంలో ఎన్నో రంజీ మ్యాచ్‌లు, దేశవాళీ పోటీలకు వేదికైంది. కాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021 జూలై 9న మైదానంలో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. సరిగ్గా రెండేళ్ల తర్వాత రూ.8. 27 కోట్లతో నిర్మించిన ఫ్లడ్‌లైట్లను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రానుండటం విశేషం. మైదానంలో నాలుగువైపులా నాలుగు ఫ్లడ్‌లైట్లను ఏ ర్పాటు చేసి ఒక్కో పోల్‌కు 99 లైట్ల చొప్పున 396 లైట్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల డే అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణతో పాటు, లైవ్ ఇచ్చేందుకు వీలవుతుంది. కాగా వైజాగ్ తర్వాత ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసిన రెండో మైదానం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం కావడం విశేషం.

- హాకీ క్రీడలో ప్రత్యేక గుర్తింపు కలిగిన కడప క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో హాకీ టర్ఫ్ కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో వీరిలో సంతోషం నెలకొంది. కడపలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో టర్ఫ్ కోర్టు ఏర్పాటుకు సంబంధించి శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.



ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానం

సూక్ష్మ నీటిపారుదలతో అధిక దిగుబడులు

సూక్ష్మ నీటిపారుదల శాఖ రాష్ట్రస్థాయి అధికారి హరినాథరెడ్డి



మాట్లాడుతున్న హరినాథరెడ్డి, చిత్రంలో వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి: సూక్ష్మ నీటిపారుదలతో ఎరువులు, పెట్టుబడులు తగ్గి నాణ్యమైన ఉత్పత్తులు, అధిక దిగుబడుల సాధనే లక్ష్యంగా నీటిపారుదల కంపెనీల ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాలని సూక్ష్మ నీటిపారుదల శాఖ రాష్ట్ర స్థాయి అధికారి హరినాథరెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లాలో సూక్ష్మ నీటిపారుదలపై అధికారులు, కంపెనీ ప్రతినిధులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా కలెక్టర్ రాయితీపై మంజూరు చేసిన సూక్ష్మ నీటిపారుదల పరికరాలను రైతులకు సత్వరమే అందించి తోటల్లో అమర్చాలన్నారు. అలాగే సూక్ష్మ నీటిపారుదల పరికరాలకు రైతు వాటాగా చెల్లించే సొమ్మును మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వారి ఫోన్‌పే ద్వారా లేదా బ్యాంక్‌నుంచి జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సూక్ష్మ నీటిపారుదల పరికరాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆదాయం వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించి, రాయచోటిని ఉద్యానవన హబ్‌గా మార్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి వెంకటేశ్వర రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు .

23న జాబ్‌మేళా

రాయచోటి: జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో డిసెంబర్ 23వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా శనివారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో అపోలో ఫార్మసీ లిమిటెడ్ వారు ఫార్మసిస్టు, ఫార్మసీ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం, వినూత్న పెర్టిలైజర్స్ సేల్స్ రెప్రజెంటేషన్ ఉద్యోగాలకోసం ఇంటర్వ్యూలు జరపుతున్నట్లు చెప్పారు. ఈ ఉద్యోగాలకు పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, పీజీ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 9153695289 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాజంపేట టౌన్: గ్రామస్థాయి సమస్యలను మండల స్థాయిలోనే వేగంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అహమ్మద్‌ఖాన్‌తో పాటు ఆర్డీఓ రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడారు. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో ఒక్కో మండలంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు అర్జీల ద్వారా తెలియ చేసిన సమస్యలను ఆయాశాఖల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.



అర్జీదారుడి సమస్యను వింటున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఓటరు జాబితా సవరణపై సమీక్ష

రాయచోటి: రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఓటర్ జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన టీషర్టులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం కలెక్టర్‌లో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించాలని, జిల్లాలో ఎక్కువగా రిజిస్ట్రేషన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

రాయచోటి: మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పోలీసు, అటవీ, విద్య, వైద్య శాఖల అధికారులతో జేసీ నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను ఆయాశాఖల అధికారులు జేసీకి వివరించారు. పోలీసు శాఖ అధికారులు మాట్లా డుతూ వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మాదకద్రవ్యాల విని యోగ నిర్మూలనకు 14500, 7382296118 టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశామన్నారు. డీఈఓ పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలలో మాదక ద్రవ్యాలు లేకుండా చేసేందుకు మాదక ద్రవ్యాల కమిటీల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వైద్యశాఖ అధికారులు, జిల్లా డ్రగ్స్ అధికారి మాట్లాడారు. అనంతరం జేసీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని పోలీసు శాఖకు సూచించారు. రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, మదనపల్లి ఆర్డీఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. శతశాతం



- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- 48 రోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రారంభం



స్టడీ అవర్స్‌లో చదువుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందు కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద మౌలిక వసతులు కల్పించారు.అలాగే విద్యార్థులకు డిజిటల్ బోధన, ట్యాబ్‌లు అందించారు. విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ 48 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి చాలా కీలకం. ప్రభుత్వం పదో తరగతి పరీక్షల షెడ్యూలు విడుదల చేసింది. మార్చి 18 నుంచి 27 వరకు పది పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం పక్కా ప్రణాళికలను రూపొందించారు.

సబ్జెక్టు వారీగా పరీక్షలు: సబ్జెక్టు వారీగా మొత్తం సిలబస్‌ను సిద్ధం చేశారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10.45 గంటల మధ్య విద్యార్థులకు స్లిప్ టెస్టు నిర్వహిస్తున్నారు. తర్వాత 10.45 నుంచి సాయంత్రం 4 వరకు సబ్జెక్టుల వారీగా పీరియడ్లు నిర్వహిస్తున్నారు. 4 నుంచి 5 గంటల వరకు స్టడీ నిర్వహిస్తారు. మరుసటి రోజు విద్యార్థులు పాఠశాలకు రాగానే వారికి స్లిప్‌టెస్టు జరపుతారు. స్లిప్ పరీక్ష అనంతరం వెంటనే మూల్యాంకనం చేసి విద్యార్థులకు అందజేయాలి. వారు చేసిన తప్పులు వివరించి నోట్స్‌లో సరైన సమాధానాలు రాసి పూర్తి స్థాయిలో సాధన చేయించాలి. స్లిప్ టెస్టు పూర్తయ్యాక అన్ని సబ్జెక్టుల్లో ఫలితాలను విశ్లేషించి ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలి. ఫలితాలు తక్కువ వచ్చిన సబ్జెక్టు ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి తదుపరి కార్యాచరణ రూపొందించి అమలు చేయాలి. ప్రతి సబ్జెక్టు టీచర్ కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఇలా ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక ప్రణాళికతో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకున్నారు.

- జిల్లాని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 13 వతేదీ నుంచి 48 రోజుల ప్రణాళను ప్రారంభించారు. ఇందులో ప్రతి ఆరు రోజులకు ఒక సైకిల్ చొప్పున 48 రోజులకు సంబంధించి 8 సైకిల్స్ ఏర్పాటు చేసుకుని అమలు చేస్తున్నారు.48 రోజుల ప్రణాళిక పూర్తికాగానే ఫిబ్రవరి 28వతేదీ నుంచి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు చేపట్టారు.ఈ ఏడాది పది పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 25,517 మంది విద్యార్థులు రాయనున్నారు. ఇందులో 18వతేదీ ఫస్ట్ లాంగ్వేజ్, 19వతేదీన సెకండ్ లాంగ్వేజ్, 20వతేదీన ఇంగ్లీషు, 22వతేదీన గణితం, 23వతేదీన ఫిజికల్ సైన్స్, 26వతేదీన బయోలాజికల్ సైన్సు, 27వతేదీన సోషియల్ పరీక్షలు నిర్వహిస్తారు.


పరీక్షలు రాసే రెగ్యులర్ విద్యార్థులు:	22,439
సప్లిమెంటరీ విద్యార్థులు :	3,078
పరీక్షా కేంద్రాలు:	129

ప్రణాళిక పక్కాగా అమలు చేస్తున్నాం



ప్రత్యేక తరగతులతో విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయం తొలగి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 48 రోజుల ప్రణాళిలతో వెనుబడిన విద్యార్థులు మెరుగుపడుతారు. దీంతో పాటు ఏ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ చేస్తున్నాం. వంద శాతం ఫలితాలే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. –శ్రీరాం పురుషోత్తం, డీఈఓ.

మంచి ఫలితాలు సాధిస్తాం



ప్రతి రోజు సబ్జెక్టుల వారీగా గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. క్లాస్ పూర్తికాగానే స్లిప్ టెస్టు పెడుతున్నాం. దీంతో ఆయా సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం. –సుబ్బారెడ్డి, హెచ్‌ఎం,జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

యాక్షన్ ప్లాన్ తప్పనిసరి

48 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అన్ని యాజమాన్య పాఠశాలలు అమలు చేయాలి. ప్రతి రోజు స్టడీతో పాటు స్లిప్ టెస్టు నిర్వహించాలి. తరువాత సబ్జెక్టుల వారీగా బోధన జరగాలి. ఈ యాక్షన్ ప్లాన్ అమలు చేయకుంటే చర్యలు తప్పవు. –ప్రసాద్‌బాబు, ఏడీ, విద్యాశాఖ కార్యాలయం

చాంపియన్‌గా కడప పాలిటెక్నిక్ కళాశాల



ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన కడప ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివారులోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన కడప రీజినల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్–2023–24 శుక్రవారంతో విజయవంతంగా ముగిశాయి. ఈ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 162 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి అధ్యక్షతన లాంగ్ జంప్, షార్ట్‌పుట్, బ్యాట్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో ఓవరాల్ చాంపియన్‌గా, స్పోర్ట్స్ చాంపియన్‌గా, గేమ్స్ చాంపియన్‌గా కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, వ్యక్తిగత చాంపియన్ ఇన్ స్పోర్ట్స్‌లో వేంపల్లి గవర్నమెంట్ కళాశాలకు చెందిన సంజన విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతగా నిలిచిన విద్యార్థులను కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌ఎ జ్యోతితోపాటు అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

స్కూటీ అదుపు తప్పి విద్యార్థికి గాయాలు



గాయపడ్డ లక్ష్మీపతి

మదనపల్లె : స్కూటీ అదుపు తప్పి బీటెక్ విద్యార్థి తీవ్ర గాయాలపాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం ఎర్రకుంట్లకు చెందిన నారాయణస్వామి కుమారుడు ఎం.లక్ష్మీపతి(20) మిట్స్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అంగళ్లలోని పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడు చందు స్వగ్రామం పెనుకొండకు వెళుతుండగా, సీటీఎం రైల్వేస్టేషన్‌లో దింపేందుకు స్కూటీలో బయలుదేరాడు. స్నేహితుడిని స్టేషన్‌లో దింపి తిరిగి అంగళ్లకు వస్తుండగా, అండర్‌బ్రిడ్జి సమీపంలో స్కూటీ అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు గుర్తించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సత్యనారాయణస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి



భూమిపూజలో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి వెంకట నారాయణభట్

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ సమీపంలోని చిప్పిలిలో వెలసిన శ్రీ చిట్టి అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామిని శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణభట్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో నూతనంగా నిర్మించనున్న భవన నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.ఎస్.మురళి, ఆలయ కమిటీ అధ్యక్షులు అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, శంకరబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు సుప్రీంకోర్టు జడ్జి వెంకటనారాయణభట్‌కు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పరీక్షా కేంద్రానికి ముందుగా చేరుకోవాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం నిర్వహించే డిగ్రీ పరీక్షలకు విద్యార్థులు నిర్ణీత సమయానికి చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప నగర పర్యటన నేపథ్యంలో పోలీసు ట్రాఫిక్ ఆంక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలంటే వివిధ మార్గాల్లో వెళ్లాల్సి ఉంటుందని, తద్వారా ఆలస్యం అయ్యే అవకాశాలు లేకపోలేదన్నారు. కావున విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకుని సకాలంలో చేరుకోవాలని సూచించారు.

నాడు లీజుదారులు.. నేడు భూ హక్కుదారులు

- సీఎం నిర్ణయంతో మారిన దళితుల తలరాతలు
- సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమ ఏర్పాటుపై హర్షం



గోపవరంలో ప్రారంభానికి సిద్ధమైన సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమ

గోపవరం : బద్వేలు నియోజకవర్గంలోని గోపవరం మండలంలో సెంచురీ ప్యానెల్స్ పరిశ్రమకు భూములు ఇచ్చిన వారంతా దళితులు. వీరంతా మొన్నటి వరకు లీజుదారులు. నేడు భూ హక్కుదారులుగా మారారు. ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఒక్కసారిగా వారి తలరాతలు మారిపోయాయి. 1972లో జర్మనీ ఫార్మింగ్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో దాదాపు 1250 ఎకరాల భూమిని ప్రాజెక్టు కాలనీ-1, 2లలో నివసిస్తున్న 200 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 5 ఎకరాల చొప్పున సొసైటీ పేరుతో లీజుకు ఇచ్చారు. ఈ భూములు సాగుకు పెద్దగా ఉపయోగపడవు. నీటి సౌకర్యం అంతంత మాత్రమే. కేవలం పదుల సంఖ్యలో మాత్రమే భూములు సాగు చేసుకునేవారు. మిగిలిన వారంతా సాగు వదిలేసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడిపేవారు. లీజు భూములు కావడంతో వాటిపై వారికి ఎలాంటి హక్కు లేదు. దీంతో ప్రభుత్వ పథకాలు కూడా వారికి వర్తించవు. భూములు లీజుకు తీసుకుని ఇప్పటికి 51 ఏళ్లు గడిచినా వారి తలరాతలు ఏమాత్రం మారలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకే బద్వేలు నియోజకవర్గంలో పరిశ్రమ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం, అందుకు అవసరమైన భూములు గోపవరం మండలంలో ఉన్నాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సీఎం దృష్టికి తీసుకుపోవడం జరిగింది. సొసైటీ పరిధిలో 1250 ఎకరాలు ఉండగా అక్కడ ఉన్న సభ్యులందరికీ భూములు కేటాయించి మిగిలిన భూములను ఇండస్ట్రీయల్ ఏర్పాటుకు ఉపయోగిస్తామని ఎమ్మెల్సీ, అధికారులు పలు దఫాలు సొసైటీ సభ్యులతో చర్చించారు. పరిశ్రమ పేరుతో సొసైటీ భూములు కాజేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, భూములు ఇచ్చేది లేదని కొందరు వ్యతిరేకించారు. ప్రతిపక్షం కూడా వారికి బాగా నూరిపోయడం జరిగింది. అయితే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సభ్యులందరికీ భూములు కేటాయించిన తర్వాతనే పరిశ్రమకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో సభ్యుల నుంచి ఆమోదం రావడం జరిగింది. అంతేకాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బద్వేలు పర్యటనకు వచ్చినప్పుడు సొసైటీ సభ్యులందరికీ కూడా భూములు కేటాయించిన తర్వాతనే శంకుస్థాపన చేయడం జరుగుతుందని చెప్పడంతో సభ్యులకు మరింత భరోసా కల్పించినట్లయింది. వెంటనే అధికారులు యుద్ధప్రాతిపదికన 200 సభ్యులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే 67 మంది నాన్ సభ్యులకు కూడా ఒక్కో ఎకరా చొప్పున పంపిణీ చేశారు. ఆ భూముల ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇప్పుడు వారికి భూ యాజమాన్య హక్కు కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు కూడా వారికి వర్తిస్తాయి. భూ పంపిణీ అయిన వెంటనే 2021 డిసెంబర్ 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంచురీ పానెల్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. సరిగ్గా రెండేళ్లకే పరిశ్రమ నిర్మాణ పనులు పూర్తయి, అదే రోజు ముఖ్యమంత్రి పరిశ్రమను ప్రారంభిస్తుండటంతో భూములు ఇచ్చిన దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ రాకతో ఈ ప్రాంతంలో భూములకు కూడా రెక్కలొచ్చాయి. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం భూ యాజమాన్య హక్కు కల్పించడంతోపాటు పరిశ్రమ నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభానికి నోచుకోవడంతో కూలీలకు, నిరుద్యోగులకు ఉపాధి రావడంతో ఈ ప్రాంత ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమ రాకతో భూములకు పెరిగిన డిమాండ్



పరిశ్రమ రాకతో మా తలరాతలు మారాయి. ఒకప్పుడు ఎందుకు పనికి రాని భూములు ఈ రోజు కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. నాడు లీజుదారులుగా భూములు సాగు చేసుకునేవాళ్లం. ముఖ్యమంత్రి నిర్ణయంతో మాకు భూ యాజమాన్య హక్కు కల్పించారు. ఇప్పుడు ప్రభుత్వ పథకాలన్నీ మాకు వర్తిస్తాయి. పరిశ్రమ ప్రారంభం కావడంతో మా బిడ్డలకు కూడా ఉద్యోగాలు వస్తాయి.

– రూకల దేవదాస్, ప్రాజెక్టుకాలనీ-1, గోపవరం మండలం

మా కల నెరవేరింది



మొదట్లో ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పినప్పుడు మేము నమ్మలేదు. పరిశ్రమకు భూములు ఇచ్చేందుకు కూడా వెనకాడాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ఒక్కో సభ్యుడికి 2 ఎకరాల చొప్పున భూ పంపిణీ చేశారు. పరిశ్రమ నిర్మించి నేడు ముఖ్యమంత్రి ప్రారంభిస్తుండటంతో మా కల నెరవేరింది.

– తుంబూరిప్రసాద్, ప్రాజెక్టు కాలనీ-1, గోపవరం మండలం



సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు రకాల సంక్షేమ పథకాలు ప్రజల దరికి చేరాయి. ఇందులో భాగంగానే తమ సొంతింటి కల నెరవేరడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా మేము బాడుగ ఇళ్లలో ఉండే వాళ్లం. అద్దె ఇవ్వడానికి ప్రతి నెల కష్టపడేవారం. ఇప్పుడు ఆ సమస్య తీరింది. జీవితాంతం సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఆర్.అమరావతి, కాయలవాండ్లపల్లి, చిన్నమండెం మండలం

ఇంటికే చేరిన సర్టిఫికెట్లు



గతంలో సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వలంటీర్ వ్యవస్థ, సచివాలయాల ద్వారా అన్నీ ఇంటికే చేరుతున్నాయి. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నాకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మా ఇంటికే వచ్చాయి. జగనన్న అమలు పరుస్తున్న పథకాల వల్ల అందరికీ మంచి జరుగుతోంది.

– వంకర వెంకటమ్మ, చింతలచెలిక గ్రామం, చిట్వేలి మండలం

పింఛన్ మంజూరైంది



నా పేరు ఈశ్వరమ్మ. మాది సామాన్య కుటుంబం. గతంలో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. ఇలాంటి కష్ట కాలంలో వలంటీరు వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీంతో నాకు ఒంటరి మహిళ కింద రూ.2,750 పింఛన్ అందుతోంది. ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. ఇల్లు మంజూరు చేయడంతో నిర్మించుకుంటున్నాను. నాకు పింఛన్ అందడంతోపాటు సొంత ఇంటి కల నెరవేరింది. సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మేలు ఎన్నటికీ మరవలేను.

– ఈశ్వరమ్మ, కాలేజీ రోడ్డు, మదనపల్లె

నాటుసారా రహిత జిల్లాగా మారుద్దాం



జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్‌కమల్

రాయచోటి : నాటుసారా రహిత జిల్లాగా మారుద్దామని జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్‌కమల్ అన్నారు. శుక్రవారం ఎస్పీ బి.క్రిష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఇప్పటి వరకు నాటుసారా తయారీ, విక్రయాలు చేసే వారిపై నమోదు చేసిన కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాల్లో అధికారులు ప్రతి రోజు 2 లేదా 3 గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్‌పోస్టు వద్ద అధికారులు వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించాన్నారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఖైనీ అక్రమ రవాణా ఇతర ప్రాంతాల నుంచి జరగకుండా అధికారులు దాడులు నిర్వహించాలని చెప్పారు. పచ్చని పల్లెల్లో జూదాలు నిర్వహించకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. నాటుసారా తయారీ, విక్రయాలలో ఎక్కువ కేసులలో ఉన్న వారిపై పీడీ యాక్ట్‌కు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని మదనపల్లి, ములకలచెరువు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందికి సూచించారు. అంత రాష్ట్ర చెక్‌పోస్టులను బలోపేతం చేయడానికి సాయుధ బలగాల నుంచి కూడా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నమోదు చేసిన కేసుల్లో ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. నాటుసారా తయారు చేసిన కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించడం ద్వారా తిరిగి నాటుసారా జోలికి వెళ్లకుండా గౌరవప్రదమైన జీవితం జీవించేలా ప్రయత్నం చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కడప రూరల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో నిర్వహించిన స్టాఫ్ నర్సుల నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 90 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. ఈ నియాకాల ద్వారా కడపలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల, కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు సర్వజన ఆసుపత్రిలో స్టాఫ్ నర్సులకు పోస్టింగ్ కల్పించారు. అలాగే ఇది వరకు ఏర్పడిన ఖాళీ స్థానాలను భర్తీ చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన స్పోర్ట్స్ మీట్



వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు

సిద్దవటం : మండలంలోని 11వ బెటాలియన్‌లో శుక్రవారం రాత్రి స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు రేంజ్ బెటాలియన్ -3 డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు అవసరమని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. సమష్టి కృషితోనే స్పోర్ట్స్ మీట్ వేడుకలు విజయవంతంగా ముగిసాయన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ పోటీల్లో హెడ్‌క్వార్టర్స్ కంపెనీ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కమాండెంట్ శ్రీనివాసరావు, అదనపు కమాండెంట్ ప్రభుకుమార్, అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, వెంకటరెడ్డి, జయప్రసాద్, డీఎస్పీ ప్రసాద్, బెటాలియన్ యూనిట్ వైద్యాధికారిణి దివ్యశ్రీ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తి ఆత్మహత్య



నాగరాజు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న బంధువులు

రాయచోటి టౌన్ : తాను ఇచ్చిన అప్పును తిరిగి చెల్లించకపోవడంతో ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం బలిజపల్లెకు చెందిన నాగరాజు(48) కొన్నేళ్లుగా రాయచోటి పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో బుక్ స్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాను సంపాదించిన డబ్బులు ఆయనకు తెలిసిన వ్యక్తికి అప్పుగా ఒక సారి రూ.20 లక్షలు, మరో సారి రూ.10 లక్షలు ఇచ్చాడు. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో డబ్బులు తీసుకొన్న వ్యక్తి నాగరాజుకు తన పేరున ఉన్న ఇంటి స్థలాన్ని (ఫ్లాట్‌ను) అగ్రిమెంట్ రాసి ఇచ్చాడు. కాలక్రమంలో ఆ స్థలం చాలా విలువైనదిగా మారడంతో చాలా ధర పలుకుతోంది. ఇదే సమయంలో ఆయన రాసిచ్చిన అగ్రిమెంట్ గడువు పూర్తవుతోంది. దీంతో నాగరాజు ఆ వ్యక్తిని నిలదీసి తనకు అగ్రిమెంట్ రాసిచ్చిన స్థలాన్ని రిజిస్టర్ చేయాలని కోరాడు. అందుకు ఆయన ఒప్పుకోకపోవడంతోపాటు డబ్బులు కూడా తిరిగి ఇచ్చేది లేదని తెగేసి చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇన్ని రోజులు కష్టపడి సంపాదించిన డబ్బులు పూర్తిగా పోయాయని నిర్వేదానికి లోనయ్యాడు. ఆయన కుమారుడు, కుమార్తె తిరుపతిలో చదువుతున్నారు. వారిని చూసే వచ్చేందుకు ఆయన భార్య తిరుపతికి వెళ్లింది. దీంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆయన ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య, పిల్లలు తిరుపతి నుంచి వచ్చిన తరువాత వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా..



సుమతి

నిమ్మనపల్లె : కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓ మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) ఉద్యోగానికి ఎంపికై ప్రశంసలందుకుంటున్నారు. పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించారు. మదనపల్లె మండలం ఇసుకనూతపల్లెకు చెందిన వేణుగోపాల్, భాగ్యమ్మ దంపతుల కుమార్తె బరినేపల్లె సుమతి(డబ్ల్యూపీసీ1651) మహిళా పోలీస్ కానిస్టేబుల్‌గా నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ ఎంపిక పరీక్ష తుది ఫలితాల్లో ఆమె ఉద్యోగం సాధించారు. తండ్రి వేణుగోపాల్ కౌలు రైతు కాగా, తల్లి భాగ్యమ్మ పాడిఆవులు పోషించుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం కాగా మొదటి కుమార్తె అమరావతికి వివాహం అయింది. కుమారుడు రవికుమార్ వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు. చివరి సంతానమైన సుమతి ప్రాథమిక విద్యాభ్యాసం ఇసుకనూతిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లోనూ, ఉన్నతవిద్య మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లోనూ, ఇంటర్మీడియెట్ విశ్వసాధన కాలేజ్‌లో, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో 2017లో డిగ్రీ పూర్తి చేసింది. 2018లో విడుదలైన పోలీస్‌కానిస్టేబుల్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికై అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి డీపీఓ కార్యాలయంలోనూ, నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేశారు. 2022 డిసెంబర్‌లో విడుదలైన ఎస్ఐ పోస్టుల నోటిఫికేషన్ ద్వారా రెండో ప్రయత్నంలో ఎస్ఐ ఉద్యోగం సాధించింది. తన లక్ష్యాన్ని సాధించేందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతోపాటు అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, పోలీసు ఉన్నతాధికారులు సహాయ సహకారాలతోపాటు ప్రోత్సాహం అందించారని సుమతి తెలిపారు. ఎస్ఐ ఉద్యోగం పొందడంపై సంతోషం వ్యక్తం చేశారు.

నేటి నుంచి జిల్లా రచయితల మహాసభలు

కడప కల్చరల్ : కడపలో జిల్లా రచయితల మహాసభలు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జిల్లా భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్య వికాస పరిణామాల సమీక్షగా ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ హుసేన్ సత్యాగ్ని అధ్యక్షత ప్రారంభించనున్నారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి స్వాగతోపన్యాసం చేస్తారు. రాష్ట్ర అధికార భాష సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరవుతారు. వైవీయూ ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్, ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి, అధికారభాషా సంఘం సభ్యులు ఆచార్య గాజులపల్లి రామచంద్రారెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య ఆత్మీయ అతిథులుగా హాజరవుతారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ప్రధాన సందేశం అందజేయనుండగా, రచయితలు డాక్టర్ కోడూరు ప్రభాకర్‌రెడ్డి, అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డి, కేవీ రమణారెడ్డి తదితరుల పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటలకు మొదటి సదస్సులో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, తవ్వా ఓబుల్‌రెడ్డి, అలపర్తి పిచ్చయ్యచౌదరి పర్యవేక్షణలో ఆచార్య జి.సాంబశివారెడ్డి, డాక్టర్ అవధానం ఉమామహేశ్వరశాస్త్రి ప్రసంగాలు ఉంటాయి. మధ్యాహ్నం 2 గంటలకు రెండవ సదస్సులో డాక్టర్ సాయిప్రసాద్, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, డాక్టర్ పి.సంజీవమ్మ అతిథులుగా పాల్గొంటారు. సాయంత్రం 3.30 గంటలకు మూడవ సదస్సు నిర్వహించనున్నారు. నాల్గవ సదస్సు సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుంది.


పెద్దల పేర్లతో..

సదస్సులకు అల్లసానిపెద్దన, మొల్లమాంబ, పుట్టపర్తి నారాయణాచార్యులు, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, జానమద్ది హనుమచ్ఛాస్త్రి, వైసీవీ రెడ్డి, శశిశ్రీ, రాచమల్లు రామచంద్రారెడ్డి, డాక్టర్ మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి పేర్లు పెట్టారు. పుస్తక ప్రదర్శనలు, విక్రయాలకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, గణిత భావనలపై పోటీలు నిర్వహించారు. వారు పలు రకాల గణిత చార్టులు, మ్యాథ్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. జిల్లాలోని బద్వేలు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత చార్టులు, ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి అభినందించారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం



వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన రామయ్య క్షేత్రం

ఒంటిమిట్ట : జిల్లాలో శనివారం నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలకు వైష్ణవాలయాలను ముస్తాబు చేశారు. ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో టీటీడీ వారు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా చేశామని తెలిపారు. స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకునేందుకు దక్షిణ వైపు నుంచి ఉత్తర ద్వారం వరకు పొడవాటి క్యూలైన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ యాజమానులు, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వారి సోదరులు మేడా రఘునాథ్‌రెడ్డి, మేడా మధుసూదన్‌రెడ్డి సాయంతో నిర్వాహకులు పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో రూ.3 లక్షల 50 వేల విలువ గల పలు రకాల పూలను ఆలయ అలంకరణకు తెప్పించామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకునేందుకు రానున్నందున వారికి మంచి నీరు, అన్న ప్రసాదాల సౌకర్యాలు కల్పించామన్నారు. పోలీసుల బందోబస్తు కూడా పెద్ద ఎత్తున ఉంటుందని ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

నేడు పుష్పగిరిలో ఉత్తర ద్వార దర్శనం

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో శనివారం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు, అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఎంతో పవిత్ర పుణ్యదినమైన వైకుంఠ ఏకాదశి నాడు పవిత్ర పినాకినీ నదిలో స్నానం చేసి ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం ఎంతో పుణ్య కార్యమని వారు పేర్కొన్నారు. కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



● కమ్మేసిన పొగ మంచు

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం కనిపించకుండా పొగ మంచు కమ్మేసింది. శుక్రవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో కురిసిన పొగ మంచు ఆలయాన్ని కప్పేసింది. ఆలయం చుట్టూ ఎటు చూసినా మంచు దుప్పటిలా చుట్టేసింది.

– ఒంటిమిట్ట

